# భూభారతి ద్వారా భూసమస్యల పరిష్కారం

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన భూభారతి కొత్త ఆర్.ఓ.ఆర్. చట్టం కింద జిల్లాలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. నెన్నెల మండలంలోని నర్వాయిపేట, జెండావెంకటాపూర్ గ్రామాల్లో జరిగిన రెవెన్యూ సదస్సులను తహసీల్దార్ మహేందర్, ఉప తహసీల్దార్ ప్రకాష్‌లతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూసంబంధిత సమస్యలపై ప్రజలు దరఖాస్తు చేసుకోవచ్చని, వాటిని రికార్డులతో సరి చూసి, క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెల 20వ తేదీ వరకు (భీమారం మండలం మినహా) అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. కొత్త చట్టం ప్రకారం భూముల రికార్డుల్లో ఉన్న తప్పులను సవరిస్తున్నామని, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ముందు భూముల పూర్తి వివరాలతో సర్వే నిర్వహించి మ్యాప్ సిద్ధం చేస్తామని వివరించారు. పెండింగ్‌లో ఉన్న సాదా బైనామా దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిష్కరిస్తామని చెప్పారు. వారసత్వ భూముల విషయంలో విరాసత్ ప్రక్రియ ప్రారంభించే ముందు సమగ్ర విచారణ చేసి, సంబంధిత వారసులకు నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. అటవీ భూముల్లో

మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



సాగు చేస్తున్న షెడ్యూల్డ్ తెగల దరఖాస్తులను అటవీ కమిటీ పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. గిరిజనులకు సాగు చేసుకునే హక్కును కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. వ్యవసాయ సాగుకు అవసరమైన యూరియా సరఫరా నిలకడగా ఉండేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. త్రాగునీటి సమస్యల పరిష్కారానికి మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి నల్లా కనెక్షన్ల ద్వారా నీరు అందిస్తామని, కనెక్షన్ లేని గ్రామాల్లో ట్యాంకర్లు, ఇతర మార్గాల్లో నీటి సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. నర్వాయిపేట నుండి మంచిర్యాల వరకు ఆర్టీసీ బస్సు నడిపేందుకు గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తామని, నూతన రేషన్‌కార్డుల దరఖాస్తులను పరిశీలించి అర్హులకు కార్డులు జారీ చేస్తామని వెల్లడించారు. గ్రామాల్లో నిరంతర విద్యుత్ సరఫరా, వీధిదీపాల ఏర్పాటు కూడా జరుగుతుందని అన్నారు. రైతుల నుండి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయడానికి మండలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, ప్రస్తుతం కొనుగోలు ప్రక్రియ ముగింపు దశలో ఉందని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లులకు తరలిస్తున్నామని చెప్పారు. రైతులు కేంద్రాలకు వచ్చినపుడు త్రాగునీరు, నీడ, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కోసం అవసరమైన సదుపాయాలు కల్పించామని, విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మైలారం గ్రామంలో 3221007 నంబర్ గల చౌకధరల దుకాణాన్ని సందర్శించిన కలెక్టర్, రేషన్ పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. జూన్, జూలై, ఆగస్టు నెలల రేషన్ సన్నబియ్యాన్ని ఈ నెల 30వ తేదీలోపు ఒకేసారి పంపిణీ చేయనున్నామని, సన్నబియ్యం నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, కార్డుదారులు నిర్భయంగా బియ్యం తీసుకోవచ్చని తెలిపారు.



## ఘనంగా ఎస్ఆర్ యూనివర్సిటీ స్నాతకోత్సవం

**శెనార్తి మీడియా, హన్మకొండ :**

హన్మకొండ జిల్లా హసన్‌పర్తి మండలం అనంతసాగర్‌లోని ఎస్ఆర్ యూనివర్సిటీలో జూన్ 6న స్నాతకోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. చాన్సలర్ వరద రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ వేడుకకు ప్రముఖ శాస్త్రవేత్త డా. జి. సతీష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రస్తుతం ఆయన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఎయిరోస్పేస్, డిఫెన్స్ మానుఫాక్చరింగ్ హబ్‌కు గౌరవ సలహాదారుగా, ఎయిరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గతంలో డీఆర్డీఓ ఛైర్మన్‌గా, రక్షణ శాఖ శాస్త్రీయ సలహాదారుగా సేవలందించారు. ఈ సందర్భంగా ఆస్కార్, గోల్డెన్ గ్లోబ్ పురస్కారాలుతో దేశానికి పేరు తెచ్చిన సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి, గీతరచయిత చంద్రబోస్‌లకు యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌లు ప్రదానం చేసింది. ఈ గౌరవం ఎంతో ఆనందంగా ఉందని, దేశానికి గర్వకారణంగా నిలవడం తనకు గౌరవంగా భావిస్తున్నానని కీరవాణి అన్నారు. అతిథి డా. సతీష్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు ఇంజినీర్లు, ఆవిష్కర్తలు, సమస్యల పరిష్కారకులుగా మారాలని ఆకాంక్షించారు. ఎస్ఆర్ యూనివర్సిటీ గత మూడేళ్లుగా జాతీయ స్థాయి ర్యాంకింగ్స్‌లో టాప్ 100లో స్థానం దక్కించుకోవడం, అటల్ ఇన్నోవేషన్ ర్యాంకింగ్స్‌లో ప్రథమ స్థానం పొందడం గర్వకారణమని పేర్కొన్నారు. భారత రక్షణ రంగం స్వదేశీ పరిజ్ఞానంతో వేగంగా అభివృద్ధి చెందుతుండగా, డ్రోన్లు, రాడార్లు, క్షిపణుల అభివృద్ధిలో దేశం ముందంజలో ఉందని తెలిపారు. గత ఏడాది ₹24,000 కోట్ల విలువైన రక్షణ సామాగ్రి ఎగుమతి జరిగిందని, త్వరలో ₹50,000 కోట్ల లక్ష్యాన్ని చేరనున్నట్లు వెల్లడించారు. వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్ యూనివర్సిటీ నివేదికను సమర్పించారు. కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంజనీరింగ్, వ్యవసాయం, సైన్స్ & హ్యూమానిటీస్ విభాగాల్లో 17 బీఏ, 16 పీజీ, 18 డాక్టరల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. చివరగా చాన్స లర్ వరద రెడ్డి పట్టభద్రులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, గౌరవ డాక్టరేట్ అందుకున్న కీరవాణి, చంద్రబోస్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రొ-చాన్సలర్ మధుకర్ రెడ్డి, ప్రొ-వైస్ చాన్సలర్ డా. వి. మహేష్, డీన్లు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



## జిల్లాలో మొదలైన బడిబాట

**శెనార్తి మీడియా, నిర్మల్ :** నిర్మల్ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట నిర్వహించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో చదువులు చెప్పే ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు ఆయా గ్రామాల్లో ఇంటింటికి తిరిగి బడి పిల్లలను గుర్తించి బడికి పంపాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన నాణ్యతగా ఉంటుందని విద్యార్థులకు ఉచిత పుస్తకాలు నోట్బుక్కులు స్కూల్ డ్రెస్సులు అందిస్తున్నామన్నారు. ప్రైవేటు పాఠశాల విధిగా విద్యాబోధన నిర్వహిస్తున్నందున పిల్లలను సరికారు బడికే పంపాలని ఉపాధ్యాయులు కోరారు. ఆయా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి పాఠశాలలో పోషకుల సమావేశం నిర్వహించి చదువు యొక్క ప్రాధాన్యతను వివరించారు. ఈ బడిబాట కార్యక్రమంలో ఎమ్మెల్యే రామారావు పటేల్, కడెం ఖానాపూర్ లో డిఇఓ రామారావు ఆయ మండలాల్లో ఎంఈఓ ను ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





## పొన్నారం లో బడిబాట

**శెనార్తి మీడియా, మంచిర్యాల :** మంచిర్యాల జిల్లా మందమర్రి మండలంలోని పొన్నారం గ్రామంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా నూతన విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారు. శుక్రవారం గ్రామంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలు గ్రామస్థులకు వివరించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి దత్తుమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. పాఠ్యపుస్తకాలతో పాటు, ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజనం ఉచితంగా అందిస్తుందన్నారు. అన్ని రకాల సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్యను ఉచితంగా అందిస్తుందని, గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పది మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయు లు పి శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి హరీష్, అంగన్వాడీ టీచర్ సునీత,ఫీల్డ్ అసిస్టెంట్ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు ఈద లింగయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అర్హులకు ఇండ్లు మంజూరు చేయాలని బీఆర్ఎస్ ధర్నా

**శెనార్తి మీడియా, చిగురుమామిడి:**

ఇందిరమ్మ ఇండ్ల పంపిణీలో జరుగుతున్న అన్యాయాన్ని ఖండిస్తూ అర్హులైన నిరుపేదలకు ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చిగురుమామిడిలో ధర్నా నిర్వహించారు. మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య నాయకత్వంలో ఈ ధర్నా జరిగింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొత్త శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ నాయకుల సూచనలతో మాత్రమే ఇండ్లు మంజూరు చేయడం, అధికారులు వారికి అనుకూలంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమని విమర్శించారు. ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని, అనర్హులకు మంజూరు చేసిన ఇండ్ల పట్టాలను రద్దు చేసి, అర్హులైనవారికి పంపిణీ చేయాలని కోరారు. రాజీవ్ యువ వికాస పథకంలోనూ ఘోరమైన తప్పిదాలు చోటు చేసుకున్నాయని పేర్కొన్నారు. పరిస్థితి మారకపోతే అధికారులను, కాంగ్రెస్ నాయకులను ప్రతి కార్యాలయం వద్ద ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షుడు పెసరి రాజేశం, మైనార్టీ సెల్ అధ్యక్షుడు సర్వర్ పాషా, యువజన విభాగం అధ్యక్షుడు తాటికొండ సందీప్ రెడ్డి, జిల్లా నాయకులు సాంబారి కొమురయ్య, మాజీ మండల అధ్యక్షుడు కృష్ణమాచారి, వైస్ ఎంపిపి బేతి రాజిరెడ్డి, సర్పంచుల ఫోరమ్ మాజీ అధ్యక్షుడు జక్కుల రవీందర్, సర్పంచులు సన్నీళ్ల వెంకటేశం, బెజ్జంకి లక్ష్మణ్, బోయిని శ్రీనివాస్, ఎంపిటిసి ఫోరమ్ మాజీ అధ్యక్షుడు మిట్టపల్లి మల్లేశం, గ్రామశాఖ అధ్యక్షులు సంపత్ రెడ్డి, గీట్ల తిరుపతి రెడ్డి, బుర్ర తిరుపతి, తోడేటి శ్రీనివాస్, కత్తుల రమేష్, నాగెల్లి రాజిరెడ్డి, రావుల ఎంకన్న, నారాయణ, పిల్లి వేణు, బిల్లా వెంకట్ రెడ్డి, సన్నీళ్ల మల్లేశం, బోయిని రమేష్, నాయకులు మహంకాళి కొమురయ్య, మహేందర్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





## అధికారులను నిలదీసిన రైతు

**శెనార్తి మీడియా, తిమ్మాపూర్:**

అల్గనూరులో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో గ్రామానికి చెందిన ఒక రైతు అధికారులను నిలదీశాడు. ఎస్సారెస్పీలో కోల్పోయిన భూములకు ఎన్వోసీ సర్టిఫికెట్ ఇవ్వాలని ఎన్నిసార్లు అధికారులను ఆశ్రయించినా స్పందన లేదని మండిపడ్డారు. ఇది తన ఒక్కడి సమస్య కాదని, ఊరంతా ఇదే సమస్యను ఎదుర్కొంటున్నదని వివరించాడు. స్పందించిన అడిషనల్ కలెక్టర్, గ్రామస్తులంతా సంతకాలు చేసి వినతిపత్రంగా సమర్పిస్తే, వారి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## 20 ఏండ్లకు మళ్లీ గ్రామంలో ఇండ్ల నిర్మాణాలు

- కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ముక్కీస రత్నాకర్ రెడ్డి
- లక్ష్మీపూర్ లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ

**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

సుమారు 20 ఏండ్లకు ఇందిరమ్మ ఇళ్లతో లక్ష్మీపూర్ గ్రామంలోని నిరుపేదల కల సాకారమవుతుందని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ముక్కీస రత్నాకర్ రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. శుక్రవారం మండల పరిధిలోని లక్ష్మీపూర్ గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలకు ముక్కీస రత్నాకర్ రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా రత్నాకర్ రెడ్డి మాట్లాడారు. పేదల సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టిందన్నారు. ప్రభుత్వ లక్ష్యాన్ని నెలవేర్చడానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పని చేస్తున్నారని కొనియాడారు. లబ్ధిదారులందరూ త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఏఎంసీ వైస్ ఛైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, హౌసింగ్ ఏఈ రవళి, పంచాయితీ కార్యదర్శి అనూష, లబ్దిదారులు ఉన్నారు.



## ఇందిరమ్మ ఇండ్ల పనులు మొదలుపెట్టాలి

**శెనార్తి మీడియా, సిరిసిల్ల:**

ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పొందిన వారితో త్వరితగతిన పనులు మొదలు చేయించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై జిల్లాలోని ఎంపీడీవోలు, హౌసింగ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించగా, జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 1413 ఇండ్లు గ్రౌండింగ్ కాగా, మిగతావి కూడా త్వరగా చేయాలని ఆదేశించారు. జిల్లాలోని ఆయా గ్రామాల వారీగా కేటాయించిన ఇందిరమ్మ ఇండ్లు ఇప్పటివరకు గ్రౌండింగ్ పై ఆరా తీశారు. ఇండ్ల మార్క్ ఔట్ లో ఉత్తమ పనితీరు చూపుతున్న పంచాయతీ కార్యదర్శులను అభినందించారు మిగతావారు కూడా వీరిని ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. పేదలు సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తుందని వివరించారు. మొదటి విడతలో ఇంటి స్థలాలు ఉన్న వారికి రూ. 5లక్షల ఆర్థిక సహాయాన్ని నాలుగు దశల్లో అందజేస్తున్నదని, 400 చదరపు అడుగుల నుంచి 600 చదరపు అడుగులలోపు ఇంటి నిర్మాణం చేసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. 4 దశల్లో గ్రీన్ చానల్ ద్వారా ఆర్థిక సహాయం అందుతుందని, బేస్మెంట్ నిర్మాణం పూర్తైన తర్వాత లక్ష రూపాయల, గోడలు నిర్మిస్తే లక్ష రూపాయలు, స్లాబ్ నిర్మించిన తరువాత 2 లక్షల రూపాయలు, ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత మరో లక్ష రూపాయలు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమవుతాయని వెల్లడించారు. జిల్లాలోని ఆయా గ్రామాల వారీగా లబ్ధిదారులతో వాట్సాప్ గ్రూపులు పెట్టాలని సూచించారు. ఆ గ్రూపుల్లో ఇందిరమ్మ ఇండ్ల పురోగతి తెలియజేయాలని పేర్కొన్నారు.

## గోశాలలో మరో రెండు కోడెలు మృతి

- జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి

**శెనార్తి మీడియా, సిరిసిల్ల:**

తిప్పాపూర్‌లోని గోశాలలో అనారోగ్యం తో ఉన్న కోడెలలో శుక్రవారం రెండు కోడెలు మృతి చెందినట్లు మిగిలిన వాటికి వెటర్నరీ వైద్యులు అందించే చికిత్సకు స్పందిస్తున్నాయని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గోశాలలో ఉన్న 1300 పశువుల్లో ప్రస్తుతం మొత్తం 11 కోడెలకు వెటర్నరీ వైద్యులు వైద్యం అందిస్తున్నారని పేర్కొన్నారు. కోడెల ఆరోగ్య సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి పేర్కొన్నారు.

## గన్నేరువరం ఎస్సైగా బాధ్యతల స్వీకరణ

**శెనార్తి మీడియా, గన్నేరువరం:**

గన్నేరువరం ఎస్ఐగా జీ నరేందర్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన తాండ్ర నరేష్ వెకెన్సీ రిజర్వ్ కరీంనగర్ కు బదిలీ కాగా ఆయనకు పోలీస్ సిబ్బంది మండల నాయకులు ఘన వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా నూతన ఎస్ఐ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు మండల ప్రజలు, నాయకులు సహకరించాలని కోరారు.

## ప్రభుత్వ స్కూళ్లలో చేరేలా బడిబాట నిర్వహించాలి

**శెనార్తి మీడియా, సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లావ్యాప్తంగా తేదీ జూన్ 6 నుంచి 19 వరకు జరుగుతున్న బడిబాట కార్యక్రమంలో పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతం పెంపొందించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించేలా చూడాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో బడిబాట కార్యక్రమం నిర్వహణ పై కలెక్టర్ రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు, అంగన్వాడీ ఆయా ఏఎన్ఎం వివోఏలు కలిసి ఒక టీమ్ గా ఏర్పడి ప్రతి ఇంటిని సందర్శించి పిల్లలంతా తప్పనిసరిగా పాఠశాలల్లో విద్యార్థులుగా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా బాలికల ఎన్‌రోల్‌మెంట్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న బాలబాలికలు ఎక్కడ డ్రాప్ ఔట్ కాకుండా చూడాలని, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు సైతం బడిబాట కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు